# సాక్షి మూగపోయింది

— శ్రీధర శ్రీరామకృష్ణ

సమయం రాత్రి పన్నెండు గంటలు. 'సినిమా భాషిణి' రిపోర్టర్ సురేష్ అప్పుడే ఇంటికి చేరుకుని ఓ పది తెల్లకాగితాలు ముందేసుకుని కూర్చున్నాడు. తను రాయబోయే ఆర్టికల్‌కు సంబంధించిన ఫోటోలు టేబుల్‌పైనున్న తెల్ల కాగితాల పక్కన పడున్నాయి. అతను రాయబోతున్న ఆర్టికల్ 'మందు మానేసిన మహానటుడు ''జీవి'' '. ఆ ఆర్టికల్‌తోపాటు ప్రచురించడానికి నాలుగైదు పోజుల్లో సినీనటుడు 'జీవి'ని తీసిన ఫోటోలవి. ఒకటి అయ్యప్పస్వామి డ్రెస్‌తోనూ, రెండోది హరి కథ దాసు పోజులోనూ, మూడోది భక్తితో చేతులు జోడించి వేంకటేశ్వరస్వామి శిలా విగ్రహానికి దండం పెడుతున్న పోజులోనూ, నాల్గోది మందు సీసాలకి దూరంగా 'జీవి' నుంచుని వాటిని అసహ్యించుకుంటున్నట్టుగానూ వున్నాయ్. ఈ నాలుగింటిపైన అవి ఏ క్రమంలో ప్రచురింపబడాలో నెంబర్లు వేసుకుని, దాని తాలూకు ఆర్టికల్ రాయడానికి సిద్ధమై వున్నాడు. ఆ సాయంకాలం 'జీవి' పోయించిన మాక్‌డెవెల్ విస్కీ ఇంకా తన ప్రభావాన్ని చూపుతోంది అతనిపై. ఆ తర్వాత తిన్న ఫ్రైడ్ చికెన్, తందూరి రోటీ, ఫ్రైడ్ రైస్ వగైరాలతో కడుపు నిండి వుండడంతో కళ్ళు మగతగా వున్నాయతనికి. సాధారణంగా ఆ టైములో అతను ముసుగు పెట్టి నిద్రపోతూనో లేక ఓ షూటింగ్ విషయాలు, విశేషాలు కవర్ చేయటానికి అవుట్‌డోర్ వెళ్ళినప్పుడు పరిచయమై విడదీయరాని బంధంగా మారిన ఓ చిన్న నటి కౌగిట్లో కరిగిపోతూనో వుండేవాడు. కానీ, ఆ ఆర్టికల్ నెక్స్ట్ ఇష్యూలో రావాలని 'జీవి'గారు చెప్పడం, దాన్ని రేపే ఆఫీసులో సబ్‌మిట్ చేయాల్సి వున్నందున అతను ఆ ఆర్టికల్ రాయటానికి కూర్చున్నాడు. 'జీవి' గారు పడేసిన కొన్ని వందల నోట్లు కూడా అతని కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నాయ్. బాత్రూమ్‌కెళ్ళి, ఓ చెంబుడు నీళ్ళతో మొహం కడుక్కుని మళ్ళీ వచ్చి కూర్చున్నాడు. 'ఆంధ్రుల అందాల, ఆరాధ్య, అభిమాన నటుడు శ్రీ జీవి' అని రాసి ఏదో అపరిచిత కంఠం వినిపించటంతో నాలుగు వైపులా చూసి ఎవరూ కనపడకపోవటంతో మళ్ళీ రాయటానికి ఉపక్రమించేటంతలో—

''ఓ నిముషం ఆగు'' మళ్ళీ వినబడింది. పెన్ను పక్కన పడేసి మళ్ళీ నాలుగు వైపులా చూసాడు ఆ కంఠం ఎవరిదోనని.

'నేనెవర్నో తర్వాత చెప్తానుగానీ, నేనడిగే ప్రశ్నకు కాస్త ఓపిగ్గా సమాధానం చెప్పగలవా' అడిగింది ఆ కంఠం.

''నాకిప్పుడు టైము లేదు. ప్రస్తుతం శ్రీ జీవి గురించి ఆర్టికల్ రాస్తున్నాను. దాన్ని రేప్రొద్దుటే ఆఫీసులో ఇచ్చెయ్యాలి'' సురేష్ మాటలు కాస్త ముద్దగా వస్తున్నాయి.

'మందు తాగినప్పుడు కన్నా మామూలప్పుడే నువ్వు బాగా రాయగలనని నాకు బాగా తెల్సుగానీ, ఇంత ఆత్మవంచన చేసు కుంటున్నావెందుకు?' ఆ అపరిచిత కంఠంలో కాస్త బాధ వ్యక్తమయింది.

''ఆత్మవంచనా!''

'కాక మరేమిటి? సాయంత్రం అవుట్‌డోర్ షూటింగ్ ముగిసింతర్వాత 'జీవి' గారింట్లో ఆయనతో కలిసి నువ్వు సీకలదాకా మందు తాగావ్. ఆయన తప్పతాగి సనుసిషిని బండబూతులు తిడుతుంటే కళ్ళారా చూసిన నువ్వు 'మందు మానేసిన మహానటుడు జీవి' అని ఆర్టికల్ రాస్తున్నానంటే అది ఆత్మవంచనా, అంతకు మించిన సామాజిక నేరం కాదూ!'

''ఒప్పుకుంటాను. ఓసారెప్పుడో ఓ మహానటుడు షూటింగ్‌లో 'కావలసిన ఎఫెక్ట్ రాలేదుసార్, మళ్ళీ ఒకసారి చేద్దాం' అని ఓ వర్ధమాన దర్శకుడు అడిగినందుకు అతన్ని చెంపమీద కొట్టి, ఆ దర్శకుడు కూడా కాస్త పోగ్రు వున్నవాడు కావడంతో ఆ గొడవ పెద్దదై, అతను డైరెక్ట్ చేసే పిక్చర్స్‌లో ఆయన నటించకపోవటం వగైరా విషయాలు యథాతథంగా రాసినందుకు నాకు దక్కిన ప్రతిఫలమేమిటో నీకు చూచాయగానైనా తెల్సా!''

'ఏం జరిగింది?''

''ఆ హీరో తాలూకు గూండాలు నన్ను ఒళ్ళు హూనమయ్యేట్టు కొట్టారు. ఆ తర్వాత 'సినిమా వెలుగులు' పత్రికా ఆఫీసుకు ఫోన్ చేసి నా ఆర్టికల్స్ తీసుకోవద్దని ఆ పత్రిక ఎడిటర్‌కి చెప్పటం, ఆ మహానటునితో వైరం పెంచుకోవటం ఇష్టం లేక వాళ్ళు నా ఆర్టికల్స్ తీసుకోవడం మానేయటం ఇవన్నీ నీకు తెలియదు. ఆ తర్వాత నేనూ, నా పెళ్ళాం పిల్లలూ రెండు మూడు నెల్లు ఒక పూట తింటే ఒక పూట తినక ఎంత కష్టపడ్డామో కూడా నీకు తెలవదు.''

'నిజమే కావచ్చు. కానీ అన్ని కష్టాలు అనుభవించినా, ఓ హీరో నిరంకుశత్వాన్ని పాఠకులకు తెలియజేసానన్న సంతృప్తి నీకు మిగలలేదా!'

''బుల్‌షిట్! నాకు కావల్సింది ఆత్మ సంతృప్తి కాదు. నా పెళ్ళాం పిల్లల్ని పోషించుకోవటం.''

'ఆ పని చెయ్యటానికి ఇంతకంటే మంచి వృత్తి దొరకలేదా!'

''ఎక్కడ దొరికింది. పట్టా ఇచ్చిన ప్రభుత్వం పని చూపించలేకపోయింది. ప్రైవేట్ ఫ్యాక్టరీలలోనో, మరో చోటో పనిచేస్తే నా నెల్లాళ్ళ జీతం నాలుగైదు వందలకి మించేది కాదు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిపాస్తులూ లేవు. చివరికి వుండడానికి స్వంత ఇల్లు కూడా. ఇలాంటి పరిస్థితుల్లో సినీఫీల్డులో సంబంధం వున్న ఓ మిత్రుడు చూపించిన దారి ఇది. ఇప్పుడు కాస్త స్థిరపడ్డాను. నా పెళ్ళాం పిల్లల్ని పోషించుకుంటూ, డిగ్నిఫైడ్‌గా బతుకుతున్నాను. ఆత్మవంచన చేసుకోకుండా బతకాలంటే చాలా కష్టం అని అనుభవ పూర్వకంగా తెల్సుకున్నవాడిని. అయినా ప్రతీ వృత్తిలోనూ అంతో ఇంతో ఆత్మ వంచన తప్పదుగా! నేన్నీకు ఇన్ని విషయాలు చెప్పాను. నువ్వెవరో తెల్సుకోవచ్చా!''

'నేనా! నీ ఆత్మసాక్షిని.'

''నేన్నీకు మనస్తాపం కలిగిస్తే క్షమించు నేస్తం. నా మానాన నన్ను బ్రతకనీ. మరెప్పుడూ దయచేసి నా జోలికి రాకు'' సురేష్ కనుకొలకుల నుంచి రెండు కన్నీటి బొట్లు రాలి టేబుల్‌పైనున్న కాగితంపై పడ్డాయి. నిజానికి అప్పుడతనికి రాయాలనిపించలేదు. అయినా రాస్తూ కూర్చు న్నాడు. అతని మనసులోని బాధను అర్థం చేసుకుందో, అతని పరిస్థితి గ్రహించి మూగదయిపోయిందోగానీ 'ఆత్మసాక్షి' మారుమాట్లాడలేదు. మరెప్పుడూ మాట్లాడదు కూడా.

